బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 16 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఏపీ నిర్మించ తలపెట్టిన బనకచర్ల వివాదంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సుముఖంగా ఉండగా తెలంగాణ ప్రభుత్వం మాత్రం తాము వచ్చేది లేదని తేల్చిచెప్పింది. అయితే ఈ సమావేశం ఎజెండా మారిస్తే తాము కూడా హాజరవుతామని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి తెలపగా.. ఈ హుటాహుటి ప్రయాణానికి కారణం మాత్రం ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశమేనని రాజకీయాల్లో చర్చ నడుస్తోంది. కృష్ణాపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏఐబీపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో కూడిన అంశాలు సమావేశపు అజెండాలో చేర్చాలని తెలంగాణ సర్కార్ ప్రతిపాదనలను పంపించింది. కాగా, ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం న్యూఢిల్లీలో సాయంత్రం 5 గంటలకు మీడియాతో మాట్లాడనున్నారు.

### ట్రిలియన్ ఏకానామీగా

# రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం



- డేటా సిటీగా హైదరాబాద్
- ప్రాణాలను రక్షించే ప్లాస్మా చికిత్సల అభివృద్ధికి ఐకార్ పునాది
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఐకార్ బయోలాజిక్స్ కొత్త యూనిట్‌కు సీఎం శంకుస్థాపన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు, అనుమతులను మంజూరు చేయడం వంటి సానుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు. శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , వివేక్ వెంకటస్వామి, శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద రెడ్డితో పాటు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఐటీ, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఫార్మా, బయో సైన్సెస్‌లతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులకు చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగం భారత్ వైపు దృష్టి సారించగా, అందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం.

తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్దేశిత గడువు నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంతో పెట్టుకున్నాం.

బల్క్ డ్రగ్స్, వాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే ఇక్కడి పారిశ్రామిక వేత్తల కృషి ఎంతో ఉంది. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని బయపెడుతున్న సమయంలో జినోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సీన్లు తయారు చేసి దాదాపు వంద దేశాలకు సరఫరా చేసిన సందర్భం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఈరోజు దేశంలో 33 శాతం వ్యాక్సీన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతుండగా, 40 శాతం మేరకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తు చేస్తున్నామంటే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఈ మధ్య కాలంలో బయో, ఫార్మసీ రంగంలో కూడా ప్రపంచంలోని అత్యాధునిక విధానాలు అవలంభిస్తున్న పరిశ్రమలను అహ్వానించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. జినోమ్ వ్యాలీ పెట్టుబడుదారులకు స్వాగతం పలుకుతున్నాం. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. మీ మద్దతు కావాలి. పెట్టుబడులు పెట్టండి.." అని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు గారు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ గారు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3 లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోయే పదేండ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అంతకుముందు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డిలు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

# బనకచర్లపై చర్చను తొలగించండి

- ఎజెండా సవరించాలంటూ కేంద్రానికి రేవంత్ సర్కార్ లేఖ
- తెలంగాణ ప్రతిపాదనలే చేర్చాలని విజ్ఞప్తి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రాల మధ్య జల వివాదాలపై కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ బుధవారం (జులై 16) ఢిల్లీలో ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఎజెండాగా చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార రామకృష్ణా రావు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాసారు. ఈ లేఖలో బనకచర్ల అంశంపై చర్చ అవసరం లేదని, వెంటనే ఆ ఎజెండాను సవరించాలని డిమాండ్ చేశారు.

**అనుమతులు లేని ప్రాజెక్టుపై చర్చ ఎందుకు?**

గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఇప్పటికే జలవనరుల నియంత్రణ బోర్డు , కేంద్ర జల సంఘం , పర్యావరణ మూల్యాంకన కమిటీ తాము అభ్యంతరాలు తెలపడం, ఇప్పటివరకు ఏ విధమైన అనుమతులు లేని ప్రాజెక్టును చర్చించాల్సిన అవసరం లేదని లేఖలో తెలంగాణ స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు చట్టాలు, ట్రిబ్యునల్ తీర్పులు ఉల్లంఘించేలా ఉందని, ఇలాంటి అంశాలను కేంద్రం ఎజెండాగా తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం తగ్గించేదిగా మారుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది.

**ఏపీ ప్రతిపాదనను తోసిపుచ్చిన కేంద్ర సంస్థలు**

బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఈఏసీ తిరస్కరించిందని, అలాగే సీడబ్ల్యూసీ కూడా తిరస్కరించాలన్న విజ్ఞప్తిని తెలంగాణ లేఖలో పేర్కొంది. ఇంకా డీపీఆర్ లేకుండానే టెండర్లు పిలిచే ప్రయత్నాలను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది.

**తెలంగాణ తరఫున ప్రాధాన్యత ఇచ్చిన అంశాలు**

తెలంగాణ ఇప్పటికే కేంద్రానికి కృష్ణా జలాలపై పెండింగ్‌లో ఉన్న అనుమతులు, పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయ హోదా, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు, ఇచ్చంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టుకు 200 టీఎంసీలు వంటి అంశాలను ఎజెండాలో చేర్చాలని ప్రతిపాదించింది.

**సీఎంల సమావేశం వరకు బనకచర్ల చర్చను వాయిదా వేయండి: తెలంగాణ**

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో సమావేశం జరిగే వరకు గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఎలాంటి చర్చ జరగకూడదని, కేంద్రం తక్షణమే ఈ అంశాన్ని ఎజెండా నుంచి తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ ద్వారా విజ్ఞప్తి చేసింది.

గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఎజెండా ప్రతిపాదనలను పంపించింది. జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ లు బనకచర్లపై తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఇప్పటివరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదనే వాదనను ఈ లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖలో అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయత ను దెబ్బతీస్తాయని అందులో ప్రస్తావించింది. ఇప్పటికే ఏపీ సమర్పించిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఈఏసీ తిరస్కరించిన విషయాన్ని ఇందులో ఉటంకించింది. కేంద్ర జల సంఘం కూడా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టును తిరస్కరించాలని విజ్ఞప్తి చేసింది. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని కోరారు. రెండు రాష్ట్రాల సీఎంల సమావేశంలో గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేయాలనీ, తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను అజెండాలో చేర్చాలని విజ్ఞప్తి చేసింది.

## నిమిష ప్రియ ఉరిశిక్ష వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

యెమన్‌లో ఉరిశిక్షకు సిద్ధమవుతున్న కేరళ నర్సు నిమిష ప్రియకు ఊరట లభించింది. ఆమె ఉరిశిక్ష అమలు ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయాన్ని అధికార వర్గాలు తెలియజేశాయి. 2017లో వ్యాపార భాగస్వామిని హత్య చేశారన్న ఆరోపణపై నిమిష ప్రియకు 2018లో ఉరిశిక్ష విధించారు. శిక్ష నుంచి తప్పించుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లిస్తే శిక్ష నుంచి బయటపడే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఆ వివరాలు మాత్రం తెలియలేదు. కేరళ నర్సుకు అవసరమైన సాయాన్ని అందిం చేందుకు భారత ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న పక్షాలతో పరస్పర అంగీకారయోగ్య మైన పరిష్కారాన్ని సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది చాలా సున్నితమైన అంశమే అయినప్పటికీ యెమన్‌లోని జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ కార్యాలయంతో భారత అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని, దీంతో శిక్ష అమలు వాయిదా పడిందని ఓ అధికారి చెప్పారు.

## పిల్లలకు విషం పెడితే సీఎం ఊరుకుంటాడా?

- గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



గురుకుల విద్యాసంస్థల్లో చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహారం బదులు విషం పెడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీవ్రంగా ప్రశ్నించారు. గత ఏడాదిలో వేలు సంఖ్యలో విద్యార్థులు కల్తీ ఆహారం కారణంగా అనారోగ్యం పాలవడం, వందల సంఖ్యలో మరణించడం ప్రభుత్వ పరిపాలన వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ ఘటనలకు పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

"పిల్లలు అనారోగ్యం పాలైనా, ఆత్మహత్యలు చేసుకున్నా, మరణాల పాలయ్యినా ప్రభుత్వం స్పందించకపోవడం... రేవంత్ రెడ్డి నియంతృత్వ పాలనకు, అమానవత్వానికి నిదర్శనం" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల జీవితం ఓట్ల కంటే తక్కువైపోయిందా? అంటూ ఆయన మండిపడ్డారు. "ఇక్కడ నేను ఒక రాజకీయ నేతగా కాకుండా, పిల్లలు కలిగిన తండ్రిగా అడుగుతున్నా. మీ పిల్లలకు అదే జరిగితే ఊరుకుంటారా?" అని సీఎం రేవంత్‌ను నిలదీశారు. విద్యాశాఖను చూసే మంత్రిగా ఇప్పటివరకు ఒక్క సమీక్షా చేయలేదని ఎద్దేవా చేశారు. "దయచేసి ఈ అంశాన్ని గంభీరంగా తీసుకోండి" అంటూ విజ్ఞప్తి చేశారు.గురుకులాల్లో కల్తీ ఆహారం విషయంలో ప్రభుత్వం ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఒక్కోసారి తాము చెప్పినప్పుడు కంటి తుడుపు చర్యలతో తప్పించుకున్నారని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్‌తో ఆడుకోవడమే కాకుండా, ఇప్పుడు ప్రాణాలూ తీయడమా? అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చైనా అధ్యక్షుడిని కలిసిన జైశంకర్

- ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై చర్చ

వివరాలు 2వ పేజీలో

# గవర్నర్ వద్దకు ఆర్డినెన్స్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. దీనికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ వద్దక పంపింది. దీనిలో భాగంగా పంచాయతీ ఆర్డెనెన్స్ ఫైల్‌ను మంగళవారం(జూలై 15వ తేదీ) మంత్రి, సీఎం సంతకం చేసి రాజ్‌భవన్‌కు పంపింది ప్రభుత్వం. 285ఏ) సెక్షన్ లో సవరణ చేస్తూ ముసాయిదాను రాజ్ భవన్‌కు పంపారు. ఎటువంటి లీగల్ చిక్కులు రాకండా ముసాయిదా డ్రాఫ్ట్‌ను గవర్నర్‌కు పంపించింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం. గవర్నర్ నుంచి ఆమోదం రాగానే ఆర్డినెన్స్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది ప్రభుత్వం. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలను మూడు నెలల్లో నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే గవర్నర్ ఆమోదంతో పంచాయతీరాజ్ సవరణ చట్టం వీలైనంత త?వరగా అమల్లోకి తీసుకు రావడానికి యత్నాలు చేస్తోంది ప్రభుత్వం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకై ఆర్డినెన్స్ ఇవ్వాలని ఇటీవల రాష్ట్ర మంత్రిమండలిలో నిర్ణయించారు.ఈ నేపథ్యంలో రిజర్వేషన్లను సడలిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదాను.. ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. ఈ నేపథ్యంలో గవర్నర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపితేనే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు దక్కే అవకాశం ఉంటుంది. ఒకవేళ గవర్నర్ తిరస్కరించడమో లేక అభ్యంతరాలు వ్యక్తంచేస్తే రిజర్వేషన్ల పెంపు నిలిచిపోయే ప్రమాదం ఉన్నది.

## 42 శాతం కోటాకు చట్టబద్ధత కల్పించాల్సిందే



- లేదంటే బీసీలందరూ మరణశాసనం రాయడం ఖాయం
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- ఇందిరా పార్క్ వద్ద బీసీటీఎఫ్ ఆధ్వర్యంలో మహాధర్నా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీలకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నయవంచన, నమ్మక ద్రోహం. మోసం, కుట్రలకు మారుపేరని నిప్పులు చెరిగారు. మంగళవారం బీసీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. బీసీలు భారతదేశంలో రెండో శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారంటే ఇందుకు హస్తంపార్టీయే కారణమని దుయ్యబట్టారు. అరవైఏళ్లు అధికారం వెలగబెట్టిన ఆ పార్టీ కులగణన చేయకుండా, బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా, సంపద సృష్టిలో భాగస్వామ్యం చేయకుండా దగా చేసిందని మండిపడ్డారు. అందుకే ఆ పార్టీ దేశవ్యాప్తంగా పుట్టగతులు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలోనూ కులగణన చేస్తామని, బడ్జెట్‌లో ఏటా రూ. 20 కోట్లు కేటాయిస్తామని, అనేక న్యాయపరమైన చిక్కులు ఎదురైతాయని తెలిసినా ఓట్ల కోసం అలవికానీ హామీలిచ్చి అధికారంలో వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏనాడు బీసీ కోటాకు చట్టబద్ధత కల్పించే విషయంలో చిత్తశుద్ధిని చూపలేదని ఆక్షేపించారు. ఇప్పుడు బీసీ వర్గాల నుంచి ఒత్తిడి పెరిగినా తర్వాత హడావుడి చేస్తూ తప్పటడుగులు వేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు

మిగిలా 2వ పేజీలో

# భూమిపైకి శుభాంశు శుక్లా




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వాషింగ్టన్: అంతరిక్షంలో భారత కీర్తిపతాకను సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా నింగి నుంచి సగర్వంగా నేలకు తిరిగొచ్చాడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా చెరిగిపోని రికార్డును తన పేరిట లిఖించుకున్న శుభాంశు.. మరో ముగ్గురు సహచర వ్యోమగాములతో కలిసి సురక్షితంగా భూపైకి చేరుకున్నారు యాక్సియం-4 మిషన్ లో భాగంగా... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు భూమిపైకి చేరుకున్నారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 2.50 నిమిషాలకు కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాల్లో ల్యాండింగ్ అయ్యారు. డ్రాగన్ స్పేస్ క్యాప్స్‌లో భూమి మీదకు చేరుకున్నారు. వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించేందుకు స్పేస్ ఎక్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సహచర వ్యోమగాములు శుభాంశు బృందానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆ సందర్భంగా పరస్పర కౌగిలింతలు, కరచాలనాలు ముగిసిన అనంతరం వాతావరణం ఉద్వేగపూరితంగా మారింది. 18 రోజుల పాటు కలిసి గడిపిన క్షణాలను అందరూ ఆనందంగా నెమరేసుకున్నారు. ముఖ్యంగా శుభాంశు రుచి చూపిన క్యారెట్, పెసరపప్పు హల్వాను ఎన్నటికీ మర్చిపోలేమని సహచరులు చెప్పుకొచ్చారు. శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర జూన్ 25, 2025న ప్రారంభమైంది. అమెరికాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా శుక్లా బృందం అంతరిక్షంలోకి వెళ్లింది. 28 గంటల ప్రయాణం తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లోకి

మిగితా 2వ పేజీలో

# మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



**-42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం..**

**-బీసీ జాబితా నుండి ముస్లింలను తీసేస్తేనే మద్దతిస్తాం**

**-రాజకీయాలకు అతీతంగా బనకచర్ల విషయలో సీఎంకు అండగా ఉంటాం..**

**-కేంద్ర మంత్రి బండి సంజయ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, అయినా ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పడం దుర్మార్గమని,ముస్లింలకు వందకు వందశాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నప్పుడు,బీసీ జనాభా దామాషా ప్రకారం బీసీ వర్గాలకు ఎందుకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించడం లేదు అని, తక్షణమే బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి ముస్లింలను తొలగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లను అందజేస్తున్నామని, 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు.

బనకచర్ల ప్రాజెక్టు అంశంపై కేంద్ర ప్రభుత్వం బుధవారం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కాబోతోందని,ఈ నేపథ్యంలో తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని అన్నారు. కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని, ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదని, బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా సమష్టిగా కృషి చేద్దామని, ఈ విషయంలో రాష్ట్ర వాదనను సీఎంల మీటింగ్ లో

మిగితా 2వ పేజీలో

## చైనా అధ్యక్షుడిని కలిసిన జైశంకర్

### ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై చర్చ

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను బీజింగ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలి కాలంలో భారత–చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ఆయన అధ్యక్షుడికి వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. 2020లో గల్వాన్ లోయ ఘటన తర్వాత మొదటిసారిగా జైశంకర్ చైనాలో పర్యటించారు. షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరయ్యే క్రమంలో ఈ భేటీ జరిగింది.

ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ "ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు నాయకత్వ స్థాయి మార్గదర్శకత్వం ఎంతో కీలకం. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నిత అంశాలపై అర్థంపూర్వక చర్చల ద్వారానే సానుకూల మార్గంలో మేము ముందుకు సాగవచ్చు," అని పేర్కొన్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, విదేశాంగ మంత్రి వాంగ్ యీతో కూడా జైశంకర్ భేటీ అయ్యారు. చైనా నుండి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటి ప్రవాహ సమాచారం పంచుకోవడం, వాణిజ్య పరమైన అవరోధాల నివారణ, రాకపోకల సాధారణీకరణ, సరిహద్దు సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చలు జరిగాయి. "చైనా–భారత్ సంబంధాలను బలోపేతం చేయడం వల్ల రెండు దేశాలకు మాత్రమే కాదు, ప్రపంచ స్థాయిలోనూ శాంతి, స్థిరత్వానికి దోహదపడుతుంది" అని జైశంకర్ పేర్కొన్నారు. టియాంజియన్‌లో జరగనున్న ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత ప్రాతినిధ్యం విషయంపై మాట్లాడుతూ, "భారీ ఫలితాల కోసం భారత్ పూర్తిగా కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు.

## 42 శాతం కోటాకు చట్టబద్ధత కల్పించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నదని తెలిసినా కేసీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ మద్దతిస్తూ వచ్చామన్నారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా విలువైన సూచనలు చేశామని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం మాత్రం తమ నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నదని విమర్శిం చారు. బీసీ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, రాష్ట్రపతికి పంపించి చేతులు దులుపుకు న్నదని ఆరోపించారు. అనేకసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఢిల్లీకి వెళ్లి ఏనా డు బీసీ బిల్లుల గురించి రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలువలేదని ఆక్షేపించారు. అఖిలప క్షాన్ని తీసుకెళ్లడంలోనూ విఫలమైందని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం కోటాకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ సర్కారు వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. బీసీబిడ్డలు తిరగబడి మరణశాసనం లిఖించడం ఖాయమని తేల్చిచెప్పారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు తప్పుడు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు నిండా ముంచుతున్నదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. బీసీ రిజర్వే షన్లకు చట్టబద్ధత కల్పించకుండా బలహీనవర్గాలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి బీసీ బిల్లులు పంపించేందే తప్పా ఆమోదానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమై ఇప్పు డు ఆర్డినెన్స్?ల పేరిట డ్రామాలు ఆడుతున్నదని దుయ్యబట్టారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే లోకల్‌బాడీ ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే ఓటుతో బుద్ధి చెప్పేందుకు బీసీ బిడ్డలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో ఇప్పించిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాల్సిందేనని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తేల్చిచెప్పారు. బీసీలను మోసం చేయాలని చూస్తే భూకంపం సృష్టిస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తప్పుల తడకగా కులగణన చేసిందని విరుచుకుపడ్డారు. నగరంలో 20 లక్షల మందికి ఇండ్లకు వెళ్లకుండానే తప్పుడు గణంకాలతో బీసీల జనాభాను తగ్గించి చూపిందని దుయ్యబట్టారు. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఇప్పుడు దగా చేస్తున్నదని విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా బీసీ బిల్లులను ఆమోదించి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలు యాచకులు కాదని, నమ్మించి వంచిస్తే తమ సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు.

నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ది మోసాల చరిత్రేనని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీల ఓట్ల కోసం అర్రులు చాచి ఇప్పుడు మొండి చెయ్యి చూపుతున్నదని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదానికి పార్లమెంట్ ప్రతిపక్షనేత రాల్‌గాంధీ చొరవ చూపాలని కోరారు. నమ్మించి నట్టేటా ముంచాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల అమలులో ఉద్దేశ్యపూర్వకంగానే కాలయాపన చేస్తున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్గౌడ్ ఆరోపించారు. బలహీనవర్గాలంటే ఆ పార్టీకి మొదటి నుంచి చిన్నచూపేనని విమర్శించారు. అందుకే 42 శాతం కోటా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నదని దుయ్యబట్టారు. బీసీలంటే అడుక్కునే వారు కాదనే విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఆచరణలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుంటే పోరాడి గుంజుకుంటామని హెచ్చరించారు.

కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. మొదటి నుంచి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని దుయ్యబట్టారు. ఇప్పుడు కూడా బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా ధోకా చేయాలని చూస్తున్నదని విమర్శించారు. అయితే కోటా ఇవ్వకుంటే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకొనే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. బీసీలందరూ ఏకమై ఉద్యమించి సాధించకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో బలహీనవర్గాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

# నగరంలో కాల్పుల కలకలం

### సీపీఐ రాష్ట్ర నాయకుడు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ మలక్‌పేట్ శాలివాహన నగర్ పార్క్‌లో ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సీపీఐ రాష్ట్ర నాయకుడు చందు నాయక్(43)పై అందరూ చూస్తుండగానే సినిమా తరహాలో దుండగులు తుపాకులతో కాల్చి దారుణంగా హత్య చేశారు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే కారులో వచ్చిన దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనతో చందునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దాంతో పార్కులో ఉన్నవారు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన నగరవాసులను ఒక్కసారిగా ఉల్లిక్కిపాటుకు గురిచేసింది.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర నాయకుడు కేతావత్ చందు నాయక్ రాథోడ్ చైతన్యపురిలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తన భార్య, కుమార్తెతో కలిసి మలక్‌పేట్‌లోని శాలివాహన పార్కు వాకింగ్‌కు వచ్చారు. వాకింగ్ చేస్తున్న సమయంలో ఉదయం 7.20 గంటల సమయంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వచ్చి ముందుగా చందు నాయక్ కండ్లలో కారం చల్లారు. ఆయన తెరుకునేలోపే తుపాకులతో ఆరు రౌండ్లకాల్పులకు తెగబడ్డారు. దాంతో ఆయన అక్కడికక్కడే మతి చెందాడు. కాల్పులతో పార్కులో ఉన్న వాళ్ళందరూ భయాందోళనతో ఉరుకులు పరుగులు తీశారు. పాత కక్షలు నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచే చందునాయక్ ఇంటిదగ్గర కొందరు అనుమానాస్పదంగా సంచరించినట్టు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తించారు. మతుని భార్య, కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లిన తర్వాతే చందు నాయక్‌పై దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుడు హత్య కేసులో చందునాయక్ నిందితుడిగా ఉన్నారు. పాతకక్షలతోనే చందునాయక్‌ను హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. చందు నాయక్ ఎక్కడికి వెళ్లినా భార్య పిల్లలు వెంట ఉంటున్నారని స్థానికులు, బంధువులు తెలిపారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పై పిడమర్తి నరేష్ తెలిపారు. సంఘటనా స్థలాని డీసీపీ చైతన్యకుమార్, ఏసీపీ సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. చందు నాయక్ మరణ వార్త విని ఆయన అభిమానులు, బంధువులు, స్నేహితులు ఆయన స్వగృహానికి భారీగా తరలివచ్చారు. సంఘటనా స్థలాన్ని తనిఖీ చేసిన క్లూస్ టీమ్స్ కీలక ఆధారాలను సేకరించాయి. ఇదిలావుండగా కాల్పులకు తెగబడ్డ నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

**10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం: డీసీపీ**

కాల్పులకు తెగబడ్డ నిందితులను పట్టుకేనేందుకు ప్రత్యేకంగా 10 బృందాలను రంగంలోకి దించినట్టు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ తెలిపారు. ఉదయం 7:30కు ఓ వ్యక్తిపై కాల్పులు జరిగాయని సమాచారం వచ్చిందన్నారు. చందునాయక్ ఉదయం వాకింగ్ చేస్తుండగా స్విఫ్ట్ కారులో వచ్చిన నలుగురు దుండగులు కాల్పులు జరిపారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తుచేస్తున్నామన్నారు. నిందితుల కోసం ప్రత్యేక 10 బృందాలను ఏర్పాటు చేశామని, సంఘటనా స్థలంలో ఐదు బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లభించిన బుల్లెట్లను పరిశీలిస్తే వెపన్‌తో ఫైరింగ్ చేసినట్టుందన్నారు. సంఘటనా స్థలంలోని అన్ని సీసీ కెమెరాల పుటేజీలను సేకరించామన్నారు. నిందితులు ఉపయోగించిన కారును గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

## మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి గట్టిగా విన్పించాలని అన్నారు.బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ప్రభుత్వం వాస్తవాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందని, అవాస్తవాలను మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తోందని అన్నారు. కొన్ని బీసీ సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు.వైఎస్ హయాంలో ముస్లింలను బీసీల్లో చేర్చి 4 శాతం రిజర్వేషన్లను అమలు చేసిందని, ఆ టైంలోనే బీసీ సంఘాలు అడ్డుకుని ఉంటే బీసీలకు అన్యాయం జరిగేది కాదని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇస్తేనే, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని,ఇప్పుడు 10 శాతం ఇస్తామంటున్నారని, ఇది దారుణమని అన్నారు.

వాస్తవానికి బీసీ జనాభా రాష్ట్రంలో 51 శాతం ఉందని, సమగ్ర కుటుంబ సర్వేలోనే ఈ విషయాన్ని తేల్చారని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీల జనాభాను 46 శాతానికి తగ్గించారని అన్నారు. దింతో బీసీల సంఖ్యను 5 శాతం తగ్గించేశారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అమలు చేస్తున్నారని, తద్వారా బీసీలకు దక్కే రిజర్వేషన్లు 32 శాతమేనని అన్నారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని,కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమే అని,దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నా యని, అందులో ముస్లింలు లబ్ది పొందుతున్నారని అన్నారు.రాష్ట్రంలో 12 శాతం మంది ముస్లింలు ఉంటే,కాంగ్రెస్ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ముస్లింలకు ఇకపై వందకు వంద శాతం రిజర్వేషన్లు పొందబోతున్నారని దీంతో బీసీలకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరగబోతోందని అన్నారు. 42కు 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తెలిపే బాధ్యతను మేం తీసుకుంటామని,లేనిపక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు.

బీసీ సంఘాల నాయకులారా,మీ దురాలోచనను, మీ రాజకీయాలను పక్కనపెట్టి బీసీలకు జరుగుతున్న అన్యాయంపై,గుండెపై చేయి వేసుకుని వాస్తవాలు మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇక్కడ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపి తదితరులు పాల్గొన్నారు.

## భూమిపైకి శుభాంశు శుక్లా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రవేశించారు. అక్కడ పైలట్ శుక్లా నేతృత్వంలోని గ్రూప్ మొత్తం 60 రకాల శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించింది. ఇందులో శుక్లా ఒక్కరే స్వయంగా 7 ప్రయోగాలు నిర్వహించారు. శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో 18 రోజులు గడిపింది. ఆ క్రమంలో 60 కీలక ప్రయోగాలు చేపట్టింది. అంతరిక్షంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై శుక్లా అధ్యయనం చేశారు. మానవ జీర్ణవ్యవస్థ ఖగోళంలో ఎలా పని చేస్తుందనే అంశంపై భారత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వీడియోను ఆయన రూపొందించారు.

దాంతోపాటు నలుగురు వ్యోమగాముల బృందం తమ మానసిక స్థితిగతులపైనా ప్రయోగాలు చేసి చూసింది. ఆ క్రమంలో ఫ్లోటింగ్ వాటర్ బబుల్ తయారు చేసి అందులో గడిపింది. అది అద్భుతమైన అనుభవమని శుభాంశు గుర్తు చేసుకున్నారు. "ఐఎస్ఎస్‌లో ప్రతి క్షణాన్నీ పూర్తిగా ఆస్వాదించా. ముఖ్యంగా కిటికీ పక్కన కూచుని కిందకు చూడటాన్ని. బహుశా నా జీవితంలోకెల్లా అత్యంత అద్భుతమైన అనుభూతి అది" అని చెప్పారు. అంతరిక్షంలో వ్యవసాయం దిశగా కూడా వ్యోమగాములు పలు కీలక పరీక్షలు జరిపారు. శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో గడిపిన 18 రోజుల్లో భూమి చుట్టూ ఏకంగా 76 లక్షల మైళ్లకు పైగా ప్రయాణించింది. ఆ క్రమంలో 288 సార్లు భూప్రదక్షిణలు చేసింది.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**



చిన్నతనం నుంచి అనేక ఇబ్బందులు గురైనప్పటికీ బాబా సాహెబ్ అంబేద్కర్ బాగా చదువుకొని దేశానికి రాజ్యాంగం రచ్చించే స్థాయికి ఎదగారని, అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళ వారం సిరిసిల్ల పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో 10వ తరగతి పిల్లలకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే, ఎమ్మెల్సీ అంజి రెడ్డిలతో కలిసి సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ విద్యా, వైద్యం రూపంలో రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరికి సహాయం అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మోడీ గిఫ్ట్ పేరిట 10వ తరగతి చదివే బాల బాలికలకు ఉచితంగా సైకిల్ అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు మొదటి ఆస్తి సైకిల్ అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సైకిల్స్ అందించామని అన్నారు. నాణ్యమైన సైకిల్ అందిస్తున్నామని, వీటిని వినియోగించి విద్యార్థులు సకాలంలో తరగతి గదులకు హాజరు కావాలని అన్నారు.

రాబోయే సంవత్సరాలలో కూడా 10వ తరగతి చదివే విద్యార్థులకు మోడీ గిఫ్ట్ కింద సైకిల్స్ అందిస్తామని అన్నారు. ఎల్.కే.జి నుంచి 6వ తరగతి చదివే విద్యార్థులకు మోడీ కిట్స్ పేరిట బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర సామాగ్రి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్ద పెద్ద కంపెనీలు వివిధ పనులపై వచ్చినప్పుడు వారితో చర్చించి సీఎస్ఆర్. నిధుల ద్వారా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. చిన్నతనంలో గంటకు 15 పైసలు, 40 పైసలు కిరాయి తెచ్చుకొని సైకిల్ నడిపేవారిమని అన్నారు. సైకిల్స్ వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టర్ నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు. యూపి. రాష్ట్రానికి చెందిన కలెక్టర్, మహా రాష్ట్ర కు చెందిన ఎస్పీ క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికతో కృషి చేయడం వల్ల గొప్ప స్థాయికి ఎదిగారని అన్నారు. విద్యార్థులు ఉదయం సమయంలో చదువుకోవాలని, మన తల్లిదండ్రుల కష్టాన్ని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో పని చేస్తుందని, 2014 కంటే ముందు విద్య కోసం 68 వేలకోట్లు కేటాయిస్తే, మోడీ ప్రభుత్వం ప్రస్తుతం 1,25,000 కోట్లు ఖర్చు చేస్తుందని, ఏకలవ్య పాఠశాలలు నవోదయ పాఠశాలలు సైనిక్ స్కూల్స్ క్రమశిక్షణకు మారుపేరుగా పని చేస్తున్నాయనిఅన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని అన్నారు. రోడ్డుపై సైకిల్ నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని , ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, 20 రోజుల తర్వాత సర్వీసింగ్ చేసుకోవాలనిఅన్నారు.

ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి సైకిల్స్ పంపిణీ చేస్తున్నారని అన్నారు. చిన్నతనంలో సర్వ శిక్షా అభియాన్ లో చదువుకునే రోజుల్లో తాను పడిన ఇబ్బందులు విద్యార్థులకు ఉండవద్దని బహుమతిగా సైకిల్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలని, మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. మోడీ గిఫ్ట్ పేరిట అందిన సైకిల్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, రోడ్డు పై జాగ్రత్తగా నడపాలని అన్నారు. ఎస్ఆర్. ట్రస్ట్ తరపున విద్యార్థులకు 10వ తరగతి తర్వాత ఎటువంటి కెరియర్ ఆప్షన్స్ ఉంటాయో తెలుసుకునేందుకు వీలుగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి సిరిసిల్ల జిల్లాలో 4 వేల సైకిళ్ళ పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. విద్యా సంవత్సరం సిరిసిల్ల జిల్లాలో 10 వేల మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ విద్యార్థులకు ఎంపీ మంచి సైకిల్స్ అందించారని, వర్షా కాలంలో రోడ్లు స్కిడ్ అధికంగా అవుతాయని, విద్యార్థులు జాగ్రత్తగా నడపాలని అన్నారు. అనంతరం కాలేజీ గ్రౌండ్ నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో సైకిల్ ర్యాలీ ని జెండా ఊపి ప్రారంబించి కొంత దూరం సైకిల్ సవారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు ఇన్చార్జి డిఈఓ వినోద్ కుమార్, స్థానిక నాయకులు, విద్యార్థులు, ప్రజలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంపై సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సమీక్ష..

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీసీఎల్ఏ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**






భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సిసిఎల్ఏ లోకేష్ కుమార్ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఫైల్ ప్రాసెస్ మొత్తం ఆన్లైన్ పద్ధతి లో ప్రొసీజర్ ప్రకారం మాత్రమే నిర్వహించాలని, త్వోరలో దరఖాస్తు పెండింగ్ ఎక్కడ ఉన్నది చెక్ చేసుకునే అవకాశం ప్రజలకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హై కోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం వాటిని మినహాయించి మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు . ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ డి సెక్షన్ సూపర్డెంట్ రామచంద్రం, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రైలు-బడి పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ..

**బలగం టీవీ, కందికట్కూర్(ఎస్సీ కాలనీ)**

కందికట్కూర్ (ఎస్సీ కాలనీ)లోని రైలు-బడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన రాష్ట్ర పండుగ అయిన బోనాలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ శోభను రెట్టింపు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి బోనాల పండుగ విశిష్టతను వివరించారు. ఈ పండుగను ఆషాఢ మాసంలో ప్రారంభించి శ్రావణ మాసం చివరి వరకు జరుపుకుంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగా అభివృద్ధి చెందాలని, ప్రజలంతా ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలని అమ్మవారిని, గ్రామదేవతలను కోరుకుంటూ జరుపుకునే పండుగ ఇది అని అన్నారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనువోజు రాజు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి లతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష

**బలగం టీవీ, తంగళ్లపల్లి**


తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన మహిళకు బద్దనపల్లి గ్రామానికి చెందిన కంది రమేష్ తో 2001 సంవత్సరంలో వివాహం జరిగింది.వీరికి ముగ్గురు పిల్లలు సంతానం కలదు. రమేష్ మద్యనికి బానిస అయ్యి భార్య, పిల్లలను నిత్యం వేధించేవాడు.ఈక్రమంలో 2017 జూలై 4న రమేష్ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యను డబ్బులు ఇవ్వాలంటూ వేధించాడు దానికి ఆమె అంగీకరించకపోవడంతో ఆమెను తీవ్రంగా కొట్టగా అడ్డువచ్చిన ఆమె తల్లిని కూడా కొట్టాడు. భార్య ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రమేష్ ని రిమాండ్ చేసిన అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్ది విక్రాంత్ వాదనలు వినిపించాగా కోర్టు కానిస్టేబుల్ శ్రీకాంత్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, సాక్ష్యదారాలను పరిశీలించిన రెండవ అదనపు మెజిస్ట్రేట్ గడ్డం మేఘన నిందితుడురమేష్ కి మూడు సంవత్సరాల శిక్ష విధించినట్లు ఎస్.ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

# కాంగ్రెస్‌పై పనికిమాలిన ఆరోపణలు చేస్తే ఖబడ్దార్

## కలెక్టర్ కు ఫిర్యాదు చేశాం,,, కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

## మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటీ

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



కాంగ్రెస్ పార్టీ పై పనికిమాలిన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు ఖబడ్దార్ అని మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటీ హెచ్చరించారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో బి ఆర్ఎస్ పార్టీ బీసీ లను పట్టించుకున్న పాపాన పోలేదని, దేశంలో ఎక్కడ లేని విధంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ కే దక్కుతుందని ఆయన అన్నారు. ప్రతి పేద వారి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్న వారిపై కలెక్టర్ కు పిర్యాదు చేయడం జరిగిందని, కలెక్టర్ ప్రభుత్వ రూల్స్ ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారని ఆయన అన్నారు.

# కాంగ్రెస్ పాలన కక్షసాధింపే

## చల్మెడ లక్ష్మి నరసింహారావు

**బలగం టీవీ, వేములవాడ:**



వేములవాడలో జరుగుతున్న కూల్చివేతలపై బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మి నరసింహారావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో కూల్చివేతలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు కక్షసాధింపు పరిపాలనను తలపిస్తోందని దుయ్యబట్టారు. “అధికారం ఉందని ప్రజలను వేధిస్తే కర్రు కాల్చి వాత తప్పనిసరిగా పెడతారు” అని హెచ్చరించారు. వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో వ్యవహరిస్తున్న తీరే దీనికి నిదర్శనమని లక్ష్మి నరసింహారావు అన్నారు. విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న నిర్వాసితులు సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి సమయం ఇవ్వాలని కోరినా, ఒక్కరోజు కూడా గడువు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వకుండా, కనీస సమయం ఇవ్వకుండా గత నెల 16న ప్రధాన రహదారిలో కొన్ని దుకాణాలు, నివాసాలను అధికారులు ఆగమేఘాల మీద కూల్చివేశారని గుర్తుచేశారు.“గంట సమయం కూడా ఇవ్వని అధికారులు, నెల రోజులు కావస్తున్నా ఎందుకు తట్టెడు మట్టి ఎత్తడం లేదు? కనీసం ఇక్కడ ప్రజలు ఉన్నారన్న విషయం స్థానిక ఎమ్మెల్యే కూడా మర్చిపోయాడా?” అని ప్రశ్నించారు. రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన మట్టి దెబ్బలు, శిథిలాలు ప్రజల కుటుంబాలను కలిచివేస్తున్నాయని, నడవడానికి కూడా వీలు లేకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ కక్షసాధింపు పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. శిథిలాలకు అవతలి వైపు ఉన్న ప్రజలు, రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు.

వేములవాడ మూలవాగు పై రెండవ వంతెన నిర్మాణంలో భాగంగా ఇరువైపులా భూసేకరణ చేసిన అధికారులు దాదాపు 30 మందిని నిర్వాసితులుగా గుర్తించారని, అభివృద్ధి పనులు జరగాల్సిందే కానీ ఇక్కడ కూడా నిర్వాసితులుగా మారుతున్న వారికి కనీస పరిహారం ఇవ్వకుండా, సమయం ఇవ్వకుండా అర్ధరాత్రి జేసీబీలను తీసుకువచ్చి కూల్చివేస్తామని చెప్పడం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, రాజరిక పరిపాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. అర్ధరాత్రి జేసీబీలను తీసుకువచ్చి ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడం కక్షసాధింపు చర్య కాదా అని నిలదీశారు. నోటీసులు ఇవ్వకుండా, పరిహారం ఇవ్వకుండా అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ప్రతిపక్షంగా తప్పనిసరిగా నిలబడి అడుగుతామని స్పష్టం చేశారు. బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారని, పరిహారం సరిపోతలేదని చెప్పినా వినకుండా నోటీసులు ఇళ్లకు చెక్కిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తిప్పాపూర్‌లో కొందరికి గజానికి రూ.8,500 పరిహారం ఇస్తామని నోటీసులు ఇచ్చారని, తిప్పాపూర్ ప్రధాన రహదారిలో ఈ పరిహారం సరి అయిందేనా, వేములవాడ ఎమ్మెల్యేగా ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. వేములవాడ పట్టణ రహదారి, రాజన్న ఆలయ విస్తరణ పేరుతో ఏళ్ల తరబడిగా జీవనోపాధి పొందుతున్న వారిపై విధ్వంసం చేస్తున్నట్టుగా తెలుస్తోందని, దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్నారు మీరు చేయని పనులు మేము చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే పదేపదే చెబుతున్నారని, అయితే నిజమే, పదేళ్ల అధికారంలో మీలాగా కక్షపూరిత పరిపాలన ఏనాడు చేయలేదని, ప్రజలు కూడా గమనిస్తున్నారని చల్మెడ లక్ష్మి నరసింహారావు పేర్కొన్నారు. మూలవాగు రెండో వంతెన నిర్మాణం కొబ్బరికాయలు కొట్టి నెలలు గడుస్తున్నా పని ముందుకు పోవడం లేదని, ఇంకా జరగాల్సిన పని ఉన్నప్పటికీ ఆగమేఘాల మీద ఈ కూల్చివేతలు ఎందుకో వారికే తెలియాలన్నారు. ఒకరోజు గుడి మూసేస్తామని చెబుతారని, మరో రోజు తమకు తెలియదని అంటారని, రాత్రికి రాత్రే పోలీసులు, అధికారులు జేసీబీలతో ప్రజల మీదికి వస్తుంటే కనీసం ఇది కూడా ఎమ్మెల్యే గారికి తెలుస్తుందా, తెలియకుండా జరుగుతుందా, ఆయనే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# 15 బంతుల్లో 5 వికెట్లు...



- వెస్టిండీస్‌ను చిత్తు చేసిన స్టార్క్
- 15 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టిన స్టార్క్
- 204 పరుగుల ఛేజింగ్ లో 27 పరుగులకే కుప్పకూలిన విండీస్
- వెస్టిండీస్ పై ఆసీస్ ఘన విజయం
- 78 ఏళ్ల రికార్డ్ బ్రేక్!
- అత్యంత వేగంగా 5 వికెట్లు తీసిన బౌలర్ గా రికార్డ్

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్‌లో అగ్రగామి ఫాస్ట్ బౌలర్లలో ఒకరైన ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ చరిత్ర సృష్టించాడు. వెస్టిండీస్‌తో జరిగిన మూడవ టెస్ట్‌లో కేవలం 15 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టి 78 ఏళ్ల ప్రాచీన రికార్డును బద్దలు కొట్టాడు.స్టార్క్ తన 100వ టెస్ట్ మ్యాచ్ ఆడుతూ, ప్రత్యర్థి వెస్టిండీస్‌ను కేవలం 27 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఆయన 6 వికెట్లు పడగొట్టి చరిత్రకెక్కాడు. ఇదే మ్యాచ్‌లో 400 టెస్ట్ వికెట్ల మార్క్‌ను చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన నాల్గవ ఆస్ట్రేలియా బౌలర్‌గా, రెండవ ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు.

**కుప్పకూలిన విండీస్**

ఇక సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్టులో వెస్టిండీస్.. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలను 121 పరుగులకే కట్టడిచేశామని సంబురపడేలోపే ఆసీస్ పేసర్ల ధాటికి కరీబియన్లు విలవిల్లాడారు. దీంతో 204 పరుగుల ఛేదనలో విండీస్.. 27 పరుగులకే చాపచుట్టేయడంతో పర్యాటక జట్టు 176 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోరు. 1955లో న్యూజిలాండ్.. ఇంగ్లండ్‌తో ఆడిన మ్యాచ్‌లో 26 రన్స్‌కు ఆలౌట్ అవగా ఆ రికార్డును విండీస్ తృటిలో తప్పించుకుంది. ఇక తన కెరీర్‌లో వందో టెస్టు మ్యాచ్ ఆడిన ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్.. సబీనా పార్క్ (కింగ్‌స్టన్)లో నిప్పులు చెరిగాడు. 15 బంతుల వ్యవధిలో అతడు ఏకంగా 5 వికెట్లు పడగొట్టడం విశేషం.

టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 5 వికెట్లు సాధించిన ఘనతను సొంతం చేసుకున్న స్టార్క్ తన తొలి ఓవర్ నుంచే విరుచుకుపడ్డాడు. తొలి బంతికే ఓపెనర్‌ను అవుట్ చేయడంతో ఒత్తిడిని పెంచాడు. ఆ తర్వాత వరుసగా వికెట్లు తీసుకుంటూ కేవలం 15 బంతుల్లో ఐదు వికెట్ల రికార్డుతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు.

ఇంతకు ముందు ఈ రికార్డు ఎర్నీ టోషాక్ (ఆస్ట్రేలియా - 1947), స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లాండ్ - 2015), స్కాట్ బోలాండ్ (ఆస్ట్రేలియా– 2021) పేరిట ఉంది. వీరిద్దరూ 19 బంతుల్లో ఐదు వికెట్లు సాధించగా, స్టార్క్ కేవలం 15 బంతుల్లోనే విజృంభించాడు. ఈ చారిత్రాత్మక విజయంతో స్టార్క్ తన టెస్ట్ కెరీర్‌లో 400 వికెట్లు పూర్తి చేశాడు. గ్లెన్ మెక్‌గ్రాత్ తర్వాత ఆస్ట్రేలియా తరపున ఈ ఘనత సాధించిన రెండవ ఫాస్ట్ బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. అంతే కాకుండా 27 పరుగుల వద్ద వెస్టిండీస్‌ను ఆలౌట్ చేయడం ద్వారా టెస్ట్ క్రికెట్‌లో ఇది రెండవ అత్యల్ప స్కోరుగా నమోదైంది.

# 2028 ఒలింపిక్స్ క్రీడల షెడ్యూల్ విడుదల

- లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ప్రతిష్టాత్మక స్థానం
- జూలై 12 నుంచి టీ20 పోటీలకు తెర



**బలగం టీవీ, హైదరాబాద్**

2028 ఒలింపిక్స్ క్రీడల షెడ్యూల్ విడుదలైంది. లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ మంగళవారం షెడ్యూల్ రిలీజ్ చేసింది. దాదాపు 128 ఏళ్ల తర్వాత ఈ విశ్వక్రీడల్లో క్రికెట్ చేరనుంది. దీంతో అందరి దృష్టి క్రికెట్ షెడ్యూల్‌పైనే నెలకొంది. ఈ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

2028లో జరగబోయే లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు విశేష ప్రాధాన్యం లభించింది. సుదీర్ఘ విరామం అనంతరం క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో పునరుద్ధరించేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం.

క్రికెట్ పోటీలు 2028 జూలై 12 నుంచి 29 వరకు జరగనున్నట్లు మంగళవారం అధికారికంగా ప్రకటించిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మెడల్ మ్యాచ్‌లు జూలై 20, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల వేదికగా లాస్‌ఏంజెల్స్‌కు సమీపంలో 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొమెనాను ఎంపిక చేశారు.

1900లో ఫ్రాన్స్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో చివరిసారిగా క్రికెట్‌కు స్థానం దక్కింది. దాదాపు 128 ఏళ్ల విరామానంతరం క్రికెట్ మళ్లీ విశ్వక్రీడల్లో చోటు దక్కించుకోవడం విశేషం. ఐసీసీ క్రికెట్‌ను గ్లోబల్‌గా ప్రాచుర్యం పొందేలా చేయాలన్న లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయానికి ఐవోసీ సమ్మతించింది. ఈ టోర్నీలో పురుషులు, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఆరేసి జట్లు పోటీపడనున్నాయి. మొత్తం 12 జట్లు ఒక్కో జట్టులో 15 మంది చొప్పున క్రికెటర్లకు ఐవోసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా 90 మంది పురుషులు, 90 మంది మహిళలు ఈ టోర్నీకి అర్హులవుతారు.


పొమెనాతో పాటు, గ్రాండ్ పియరీ, లాడర్‌హిల్, న్యూయార్క్ వేదికలు ఒలింపిక్స్ క్రికెట్ పోటీలకు ఆతిథ్యమివ్వనున్నాయి. 2024 టీ20 ప్రపంచకప్‌ను వెస్టిండీస్‌తో కలిసి విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో అమెరికా ఈ అవకాశాన్ని సమర్ధవంతంగా వినియోగించుకోనుంది. “అమెరికా ఘనమైన క్రీడా వారసత్వానికి ప్రతీకగా ఈ ఒలింపిక్స్‌ను అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే మిలియన్‌కు పైగా అథ్లెట్లు పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకున్నారు” అని లాస్‌ఏంజెల్స్ మేయర్ కరెన్ బాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

## రూ.4000 కోట్ల వ్యయంతో ‘రామాయణం’

తేష్ తివారీ దర్శకత్వంలో రణ్ బీర్ కపూర్ , సాయి పల్లవి, కన్నడ స్టార్ యశ్ ప్రధాన పాత్రల్లో భారీ తారాగణంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వస్తున్న సినిమా ‘రామాయణం’. రెండు భాగాల్లో రానున్న ఈ మూవీ పార్ట్ -1 ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఈ సినిమా బడ్జెట్ అటు సినీ వర్గాలతో పాటు సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే ‘రామాయణం’ ఫ్రాంచైజీ మొత్తం బడ్జెట్ రూ. 1600 కోట్లు అని వార్తలు వచ్చాయి. పార్ట్– 1 బడ్జెట్ రూ. 900 కోట్లు కాగా, రెండో భాగం బడ్జెట్ రూ. 700 కోట్లుగా చాలా కథనాలు వెలువడ్డాయి. అయితే తాజాగా సినిమా బడ్జెట్ విషయంలో షాకింగ్ విషయం బయటకు వచ్చింది. ఈ మూవీ బడ్జెట్ అందరూ ఊహించినదానికంటే చాలా ఎక్కువ అని స్వయంగా నమిత్ మల్హోత్రా ప్రకటించారు. ఇప్పటి వరకు, సమీప భవిష్యత్ లో ఏ సినిమాకు ఖర్చు చేయనంత బడ్జెట్ ను ఈ మూవీకి వెచ్చిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు. రెండు విభాగాలు కలిపి దాదాపు 500 మిలియన్ డాలర్లు, అంటే రూ. 4000 కోట్ల వ్యయంతో ఈ సినిమాను నిర్మిస్తున్నట్లు ఆయన ఓ పాడ్ కాస్ట్ లో చెప్పడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# 114 ఏళ్ల మారథాన్ పరుగుల వీరుడు ఫౌజా సింగ్ మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**




మారథాన్ ను పూర్తి చేసిన అత్యధిక వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన ఫౌజా సింగ్ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం జలంధర్ – పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆయనను ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఫౌజా సింగ్ ను స్థానికులు హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఫౌజా సింగ్ తలకు తీవ్ర గాయమైందని, రక్తస్రావం కారణంగా ఆయన తుదిశ్వాస వదిలారని వైద్యులు ప్రకటించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన పిల్లలు వచ్చే వరకూ ఫౌజా సింగ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచుతామని వారు చెప్పారు.

పంజాబ్ లోని జలంధర్ జిల్లా బేయాస్ గ్రామంలో 1911 ఏప్రిల్ 1న ఫౌజా సింగ్ జన్మించారు. ఆయనకు ప్రస్తుతం 114 ఏళ్లు. భార్య, కొడుకు మరణం తర్వాత ఫౌజా సింగ్ రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. 89 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన పరుగును వందేళ్లు దాటినా ఆపలేదు. ఈ వయసులోనూ ఫౌజా సింగ్ ఉత్సాహంగా పరుగులు తీసి రికార్డులకెక్కారు. పలు మారథాన్లను పూర్తిచేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. లండన్, న్యూయార్క్, టొరంటో లలో జరిగిన మారథాన్ లలో ఫౌజా సింగ్ పాల్గొన్నారు. ఫౌజా సింగ్ మరణంపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా విచారం వ్యక్తం చేశారు. వందేళ్లు దాటినా ఉత్సాహంగా పరుగులు తీస్తూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

1993లో ఇంగ్లండ్‌కు వెళ్లిన ఈ దిగ్గజ అథ్లెట్.. ‘టర్బన్ టోర్నడో’ అంటూ అందరి మన్ననలు పొందారు. 2011లో జరిగిన టొరంటో మారథాన్‌లో 100 ఏండ్ల వయసులో 8 గంటల 11 నిమిషాల్లో రేసు పూర్తి చేసి కొత్త రికార్డు నెలకొల్పాడు. ఐదేండ్ల పసిప్రాయం వరకు నడవని ఆయన.. తన 14 ఏండ్ల అథ్లెటిక్స్ కెరీర్‌లో తొమ్మిది మారథాన్ రేసుల్లో పోటీపడటం విశేషం. తన కుటుంబసభ్యుల మరణాల నుంచి తేరుకునేందుకు పరుగును ఎంచుకున్న ఫౌజాసింగ్‌ను 2015లో బ్రిటిష్ ఎంపైర్ మెడల్ వరించింది. 2012లో జరిగిన హాంకాంగ్ మారథాన్.. ఆయన చివరి అంతర్జాతీయ రేసుగా నిలిచింది. పంజాబ్‌లో డ్రగ్స్ నియంత్రణకు అక్కడి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఈ దిగ్గజ అథ్లెట్ కీలకంగా వ్యవహరించారు. కనీసం నడిచే వీలు లేని వయసులో కుర్రాళ్లకు స్ఫూర్తిగా నిలిచిన ఫౌజాసింగ్ అకాల మృతి అందరినీ కలిచివేసింది.

# లిరిక్ రైటర్‌గా మారిన రామ్ పోతినేని

**బలగం టీవీ, హైదరాబాద్**





ప్రముఖ యువ నటుడు రామ్ పోతినేని గేయ రచయితగా కొత్త అవతారం ఎత్తారు. త్వరలో విడుదల కానున్న తన చిత్రం ‘ఆంధ్ర కింగ్ తాలుకా’ లోని తొలి పాటకు ఆయనే స్వయంగా సాహిత్యం అందించారు. ఈ పాట జూలై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ పోతినేని తన కెరీర్‌లో తొలిసారిగా ఒక పాటకు సాహిత్యం అందించడం విశేషం. ఈ పాట “నా కల నిజమాయే” అనే పల్లవితో మొదలవుతుందని సమాచారం. ఈ పాటకు వివేక్–మెర్విన్ ద్వయం సంగీతం అందించగా, యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ తన అద్భుత గాత్రంతో ఆలపించారు.

తన తొలి పాట గురించి రామ్ పోతినేని మాట్లాడుతూ, “ఈ పాట నా హృదయంలో నుంచి వచ్చింది. వివేక్–మెర్విన్ అందించిన అద్భుతమైన ట్యూన్ నన్ను పాట రాయడానికి ప్రేరేపించింది. నా మనసులో ఉన్న భావాలను అక్షర రూపంలో పెట్టగలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. నా అభిమానులకు ఈ పాట తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను” అని పేర్కొన్నారు.

# జులై 18న సంత్ తుకాకాం జీవిత కథ

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆదిత్య ఓం. నటుడిగా, నిర్మాతగా కొనసాగుతూనే మరోవైపు డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో బిజీగా ఉన్నాడు. ఆదిత్య ఓం ఈ సారి డైరెక్టర్‌గా మరాఠీ సాధువు కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. 17వ శతాబ్దపు మరాఠీ సాధువు–కవి భక్తిని ప్రతిఘటనగా మార్చిన సంత్ తుకాకాం జీవిత కథ ఆధారంగా వస్తోన్న చిత్రం సంత్ తుకారం. పాపులర్ మరాఠీ యాక్టర్ సుబోధ్ భావే టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఈ మూవీ జులై 18న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో విడుదల చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో శివ సూర్యవంశీ, షీనా చౌహాన్, ట్వింకిల్ కపూర్, రూపాలి జాదవ్, అరుణ్ గోవిల్, సంజయ్ మిశ్రా, ముఖేశ్ భట్‌తోపాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక పాపులర్ యాక్టర్ ముఖేశ్ ఖన్నా ఇచ్చిన వాయిస్ ఓవర్ ఈ మూవీకి హైలెట్ కానుందట. ఆదిత్య ఓం మొత్తానికి ఈ సారి హిందీ మార్కెట్‌పై కూడా ఫోకస్ పెట్టి తనదైన ప్రమోషన్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఆదిత్య ఓం కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కర్జన్ ఫిలిమ్స్ బ్యానర్‌పై పురుషోత్తమన్ స్టూడియోతో కలిసి బీ గౌతమ్ నిర్మిస్తున్నారు.